క్లుప్తంగా

వయనాడ్ బాధితులకు సహాయ నిధి సేకరణ



లక్ష్మీపురం: కేరళలోని వయనాడ్‌లో ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా కొండ చర్యలు విరిగిపడి సుమారు 400 మంది మృతి చెంది, ఊర్లకు ఊర్లు కొట్టుకుపోవడం బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో బుధవారం వరద బాధితుల సహాయ నిధిని సేకరించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ బాధితుల్ని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు, ఐపీటీఏ జాతీయ కార్యదర్శి గని, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సామూహిక సీమంతాలు



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో బుధవారం శ్రీ పరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో గైనకాలజీ విభాగంలో గర్భిణులకు వైభవంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. శ్రీ పరంజ్యోతి భగవతి పద్మావతి అమ్మవారి జన్మదిన వేడుకలలో భాగంగా సప్తదానాల పేరిట సమితి సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ గర్భిణులకు సురక్షితమైన ప్రసవం జరిగి మంచి ఆరోగ్యంతో భూమిపై చిన్నారులు రావాలని కోరారు. కార్యక్రమంలో గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ వి .అరుణ, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ కరుణ, డాక్టర్ శివరంజని, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ స్వరూప, డాక్టర్ సునీత, డాక్టర్ ఆదిలక్ష్మి, ఎల్. అరుణ, సమితి సభ్యులు కిలారి అరుణ, బొగ్గవరపు సుజా రాణి, నాగశ్రీ , పోగుల పావని, కుమారి, సుస్మిత పాల్గొన్నారు.

టీడీఎస్ ప్రకియను తక్షణమే పూర్తిచేయాలి: ఎస్టీయూ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరపాలక సంస్థ, ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల టీడీఎస్ ప్రక్రియను తక్షణమే పూర్తిచేయాలని ఎస్టీయూ నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కె. వెంకయ్య, మహంకాళరావు డిమాండ్ చేశారు. కలెక్టర్ బంగళా రోడ్డులోని గుంటూరు అర్బన్, రూరల్ మండలాల ఎంఈవో కార్యాలయంలో బుధవారం ఎంఈవోలు బి.వి. రమణయ్య, నాగేంద్రమ్మ, జ్యోతికిరణ్‌ను కలిసిన ఎస్టీయూ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యాయుల వేతనాల్లో క్వార్టర్-1, 2 టీడీఎస్ పూర్తి కాకపోవడంతో 600 మంది ఉపాధ్యాయులు ఈ-ఫైలింగ్ చేయలేక పెనాల్టీ పరిధిలోకి వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్. జోసఫ్ సుధీర్‌బాబు, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. ప్రసాదరావు, నాయకులు కె.విజయబాబు, కెనడీ, డేవిడ్‌రాజు, యు. మస్తాన్‌వలి పాల్గొన్నారు.

నేడు, రేపు కేఎల్పీ స్కూల్లో రోబోటిక్ సైన్స్ ఎక్స్‌పో

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో గురు, శుక్రవారాల్లో రోబోటిక్ సైన్స్ ఎక్స్ పో నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కంప్యూటర్ సైన్స్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ బ్రాంచ్‌లకు విపరీతమైన ఆదరణ నెలకొన్న నేపథ్యంలో కంప్యూటర్ ఆధారిత బోధన అమల్లోకి తెచ్చినట్లు చెప్పారు. రోబోటిక్ విజ్ఞానాన్ని మరింతగా అభివృద్ధి పర్చి, వాస్తవ వినియోగంలోకి తెచ్చేందుకు విశ్రాంత కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు శ్రీనివాసరావు పర్యవేక్షణలో తమ పాఠశాలలో 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో రూపొందించిన 40 రోబోటిక్ పరికరాలను ప్రదర్శనలో ఉంచుతున్నట్లు చెప్పారు. గురు, శుక్రవారాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహిస్తున్న సైన్స్ ఎక్స్‌పోను నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు సందర్శించాలని సూచించారు.

శత వసంతాల విద్యా సుగంధం

- శతాబ్ది శారదానికేతన్
- మహిళా విద్యావ్యాప్తికి కృషి
- స్వాతంత్ర్యోద్యమ సమయంలో నెలకొల్పిన ఉన్నవ లక్ష్మీనారాయణ దంపతులు

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రిటిష్ పాలకుల్ని ఎదిరించి జైలుశిక్ష అనుభవించిన స్వాతంత్ర్య సమరయోధుడు ఉన్నవ లక్ష్మీనారాయణ నెలకొల్పిన ఆ విద్యాసంస్థ మహిళా విద్యకు ప్రోత్సాహాన్ని అందించింది. స్వాతంత్ర్యానికి పూర్వమే మహిళా సాధికారత, మహిళా విద్యకు గల ప్రాధాన్యత చాటింది. తొలితరం విద్యాసంస్థల్లో ఒకటిగా నిలిచింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంలో నగరంలోని ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతులు స్థాపించిన శారదానికేతన్ వందేళ్ల చరిత్రను పూర్తి చేసుకుని 103వ వసంతంలోకి అడుగుపెట్టడటం విశేషం. 1922లో నెలకొల్పిన శారదానికేతన్ అంచెలంచెలుగా ఎదిగి మహిళా విద్యకు చిరునామాగా నిలిచింది. రచయితగా ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన మాలపల్లి నవల అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. అది ఎంతగా అంటే, దాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది.

మహాత్మాగాంధీ అడుగుపెట్టిన స్థలం

బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సహాయ నిరాకరణ ఉద్యమం కొనసాగుతున్న కాలంలో మహాత్మాగాంధీ తన దేశ పర్యటనలో భాగంగా వందేళ్ల కిందట గుంటూరు నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా బ్రాడీపేట 2/14లో స్థాపించిన శారదానికేతన్‌ను సందర్శించారు. గుంటూరులో ఐదు రోజులు బస చేసిన ఆయన ప్రాంగణంలో ఉన్న మర్రిచెట్టు కింద కూర్చుని, అక్కడే ఉన్న బావి వద్ద ప్రతి రోజూ స్నానం చేసేవారు. సహాయ నిరాకరణ ఉద్యమానికి మద్దతుగా ప్రజల్ని చైతన్యపర్చేందుకు మర్రిచెట్టును వేదికగా చేసుకున్న మహాత్మా గాంధీ ఇక్కడే ప్రసంగాలు చేశారు. గుంటూరు పర్యటన ముగించుకుని వెళ్లే సమయంలో ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతులు మహాత్మునితో కలసి అడుగులు వేశారు. స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళలు సైతం ముఖ్య పాత్ర పోషించాలనే ఆశయంతో వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఉన్నవ దంపతులు 1922 జూలైలో ఉన్నతాశయంతో నెలకొల్పిన విద్యాలయం కాలక్రమంలో శ్రీ శారదానికేతన్‌గా ఎదిగింది. ఆనాడు మహాత్మునికి నీడను ఇచ్చిన మర్రిచెట్టు కాలగమనంలో భారీ వర్షాలకు వేళ్ల సహా నేలకొరిగింది. ఆయన స్నానమాచరించిన బావి పూడుకుపోయింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకుని వందేళ్ల చరిత్ర కలిగిన శారదానికేతన్‌లో నాడు మర్రిచెట్టు, బావి ఉన్న ప్రదేశాన్ని ఒక సర్కిల్ ఏర్పాటు చేసి మహాత్మాగాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు.



బ్రాడీపేటలోని శారదానికేతన్ (ఫైల్)



ఉన్నవ లక్ష్మీనారాయణ



ఉన్నవ లక్ష్మీబాయమ్మ



శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహాత్మా గాంధీ గడిపిన ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటం, జెండాలు (ఫైల్)

శతాబ్ది ఉత్సవాలను నిర్వహించిన ప్రభుత్వం

స్వాతంత్ర్యోద్యమ చరిత్ర కలిగిన శారదా నికేతన్ శతాబ్ది ఉత్సవాలను రెండేళ్ల కిందట వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శారదానికేతన్ మహిళా విద్యాసంస్థలను విద్యాశాఖ పరిధిలోకి తెచ్చి పునఃవైభవానికి కృషి చేసింది.

కమిషనర్‌గా పులి శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా పులి శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ... నగర మేయర్, మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ నగరాన్ని అన్ని అంశాల్లో మెరుగ్గా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య, డి.వెంకటలక్ష్మి, ఎస్ఈ ఎం .శ్యాంసుందర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంహెచ్ఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అవసరం

నెహ్రూనగర్: నగరాభివృద్ధిలో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం అవసరమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. కమిషనర్‌గా విధుల్లో చేరిన తరువాత మేయర్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

నగర ప్రజలంతా హర్ ఘర్ తిరంగాలో భాగంగా నగరంలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని అధికారులు, సిబ్బందితో పాటు బుధవారం తాము కూడా జాతీయ జెండాతో సెల్ఫీ దిగి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా htt p://harghartiranga.com వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, హర్ ఘర్ తిరంగా ప్రశంసా పత్రం పొందినట్లు చెప్పారు. నగర ప్రజలంతా ఇదే విధంగా అప్‌లోడ్ చేసి ప్రశంసా పత్రాన్ని పొంది గుంటూరు నగర కీర్తిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలపాలని కోరారు.

స్వాతంత్ర్య యోధుల త్యాగాలను విస్మరించరాదు



విద్యార్థినులతో హనుమంతరెడ్డి, శాంతమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: దేశానికి స్వాతంత్ర్య సాధనలో అహర్నిశలు శ్రమించిన త్యాగధుల్ని విద్యార్థులు, యువతరం నిత్యం స్మరించుకోవాలని ప్రముఖ చరిత్ర నిపుణుడు సంగిరెడ్డి హనుమంతరెడ్డి సూచించారు. లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో బుధవారం చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా-ఇండియన్ ఇంటిలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో 'స్వాతంత్ర్య సమరవీరుల చరిత్ర' అనే అంశంపై అవగాహన కల్పించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న హనుమంతరెడ్డి మాట్లాడుతూ అమరవీరుల త్యాగ ఫలమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని తెలిపారు. దేశంలోకి 1857లో ఈస్ట్ ఇండియా కంపెనీ రాక మొదలు 1947 ఆగస్టు 15 వరకు జరిగిన స్వాతంత్ర్య ఉద్యమం, సంగ్రామానికి సంబంధించిన ప్రధానమైన అంశాల్ని విద్యార్థినులకు వివరించారు. ప్రథమ స్వాతంత్ర్య పోరాటం మొదలు అనేక ఉద్యమాలు, వీరోచిత పోరాటాల్లో పాల్గొన్న వ్యక్తులు, ఉద్యమాన్ని మలుపుతిప్పిన సంఘటనలపై మాట్లాడారు. స్వాతంత్ర్య అనంతరం అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణం, బలహీన వర్గాలను బలోపేతం చేసేందుకు విశేష కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం తరపున ప్రవీణ్‌కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

కిడ్నాపర్లను కఠినంగా శిక్షించాలి: ఎస్‌ఎఫ్‌ఐ



మధుసూదనరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కిరణ్

లక్ష్మీపురం: స్థానిక పట్టాభిపురంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో విద్యార్థినుల్ని కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావుకు ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించిన వసతి గృహం వార్డెన్‌ని తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. కొంతమంది విద్యార్థినుల్ని హాస్టల్ వార్డెన్ బానిసలుగా చూస్తూ వారితో పనులు చేయించడం సర్వసాధారణంగా మారిపోయిందని ఆరోపించారు. ఇటువంటి చర్యల్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, జిల్లా సహాయ కార్యదర్శి కె.పవన్, ఏ.యశ్వంత్ పాల్గొన్నారు.

విజ్ఞానంతో పాటు నాయకత్వ లక్షణాలు అవసరం



విద్యార్థులతో ప్రిన్సిపాల్ అరుణ, మూర్తి, శివప్రసాద్



మాట్లాడుతున్న సీఐ కిరణ్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులంతా వినయం, వివేకం, విజ్ఞానంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీచైతన్య స్కూల్లో బుధవారం నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకుల బాధ్యతలు స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అంజయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ కె.అరుణ మాట్లాడుతూ విద్యార్థులు భావి భారత పౌరులుగా ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ కో-ఆర్డినేటర్ మూర్తి, డీన్ శివప్రసాద్, ఏవో శివకుమార్, జోనల్ పీఈటీ ఇన్‌చార్జ్ ఎస్. లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో..

బృందావన్ గార్డెన్స్‌లోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో బుధవారం విద్యార్థి నాయకుల బాధ్యతలు స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ కిరణ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులంతా నాయకత్వ లక్షణాలు, విలువలను అలవర్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో ముందుకు వెళ్లిన వారు కచ్చితంగా జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటారని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు టి. ప్రమీలాకుమార్ మాట్లాడుతూ జీవితంలో సంకల్పం, నిశ్చయం, సహనం, దీక్ష, ఏకాగ్రత కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా క్లాస్ లీడర్లుగా ఎన్నికైన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం జానకీ రామిరెడ్డి, ఏవో రాకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి వెంకటేశ్వరరావుకు సత్కారం



వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న కమిషనర్ నరసింహారెడ్డి, అధికారులు, సిబ్బంది

లక్ష్మీపురం: కస్టమ్స్, సెంట్రల్ ట్రస్టు ఎక్సైజ్ శాఖలో గెజిటెడ్ అధికారిగా మూడు దశాబ్దాల కిందట ఉద్యోగ విరమణ చేసి, ట్యాక్స్ కన్సల్టెంట్‌గా, న్యాయవాదిగా, హైకోర్టు ట్రాన్స్‌లేటర్‌గా పలు సేవలు అందించి తొమ్మిది పదులు వయస్సు దాటి, ప్రస్తుతం విశ్రాంత జీవనాన్ని కొనసాగిస్తున్న చివుకుల వేంకటేశ్వరరావును కేంద్ర జీఎస్టీ శాఖ ఘనంగా సన్మానించింది. స్థానిక కన్నావారితోటలోని జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన 'పెన్షన్ అదాలత్' సమావేశంలో ఆయన్ను సెంట్రల్ జీఎస్టీ కమీషనర్ సాధు నరసింహారెడ్డి దుశ్శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్‌కు వెంకటేశ్వరరావు నిస్వార్థంగా, విశిష్టమైన సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం నాయకులు టి.వివేకానంద, గద్దె తిలక్, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.వి. సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, కె.సామ్రాజ్యం పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: గర్భిణుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు. హైరిస్క్ గర్భిణులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ, జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె చెప్పారు. గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్ల సమావేశం నిర్వహించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీలను 12 వారాల్లోపు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రులలో తప్పనిసరిగా కాన్పులు జరిగేలా చూడాలని, రక్తహీనతని ఎప్పటికప్పుడు మానిటర్ చేసుకుంటూ ఉండాలని సూచించారు. ఈనెల 20న నిర్వహించబోయే జాతీయ నులి పురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని తెలిపారు. జ్వరం కేసులపై అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి జ్వరం కేసుకు రక్త పరీక్ష తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. మలేరియా, డెంగీగా గుర్తిస్తే వెంటనే నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాల్ని ఎప్పటికప్పుడు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ కె.వి సుబ్బరాజు, డాక్టర్ లక్ష్మానాయక్, సుబ్బరాయణం పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన జూడాల సమ్మె

– నల్ల బ్యాడ్జీలు ధరించి ఆసుపత్రి ఎదుట నిరసన




ధర్నా చేస్తున్న వైద్య విద్యార్థులు

గుంటూరు మెడికల్: కోల్‌కొతా ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో విధుల్లో ఉన్న పీజీ వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ గుంటూరు జీజీహెచ్‌లో ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ వైద్యుల సమ్మె బుధవారానికి రెండో రోజుకు చేరుకుంది. నల్లబ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించారు. సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట బైఠాయించి, ప్లకార్డులు చేతబట్టుకుని నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంఘటనపై తక్షణమే సీబీఐ విచారణ చేపట్టాలని జూడాల సంఘం నేతలు డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, నిందితుడికి తక్షణమే శిక్ష పడేలా చూడాలని కోరారు. దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేలా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమకు రక్షణ కల్పిస్తేనే విధులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

సీనియర్ వైద్యుల మద్దతు

జూడాల సమ్మెకు బుధవారం సీనియర్ వైద్యులు మద్దతు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ శాఖకు చెందిన యూనియన్ నేతలు నల్లబ్యాడ్జీ ధరించి వారితో బైఠాయించి సంఘీభావం తెలిపారు. జూనియర్ వైద్యులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. న్యాయ పోరాటం, డాక్టర్ నిర్భయ 2.0 పేరుతో చేస్తున్న నిరసన కార్యక్రమంలో జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పెండెల దీక్షిత్, సెక్రటరీలు డాక్టర్ అన్వర్‌బాషా, డాక్టర్ రవి, డాక్టర్ చరణ్, డాక్టర్ భవిత, డాక్టర్ నిమ్మి, డాక్టర్ అశ్విని పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



గుంటూరు మెడికల్: స్థానిక కొత్తపేటలో బుధవారం బీజేపీ ఆరో మండల అధ్యక్షుడు సురేష్ కుమార్ జైన్ ఆధ్వర్యంలో విజీడం స్కూల్ విద్యార్థులతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర, సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, తూర్పు కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, ప్రిన్సిపల్ రవి ప్రారంభించారు. కార్యక్రమంలో కోకన్వీనర్ షేక్ రఫీ, షేక్ కుదుస్, షేక్ రవూఫ్, పోతురాజు వెంకట్, మళ్లిశెట్టి పవన్, దేవిశెట్టి బాబూరావు, తెల్ల మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు

అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని గుంటూరు రూరల్ ఏటుకూరులో బుధవారం ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కన్నా రవి దేవరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో 16వ డివిజన్ గుంటూరు కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ , హనుమాన్ గాయత్రి శక్తి పీఠాధిపతి విశ్వయోగి శ్రీనివాస్ ప్రభుస్వామి, తన్నీరు రామకృష్ణ, తన్నీరు రవి, మహేష్, శ్రీనివాసరావు, కన్నా మార్కండేయులు పాల్గొన్నారు.

విగ్రహాలు, రోడ్లు శుభ్రం చేసిన బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో బుధవారం స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను నీటితో కడిగి శుభ్రం చేశారు. చీపుర్లు చేతబట్టుకుని రోడ్లను పరిశుభ్రంగా మార్చారు. ప్రతి ఒక్కరు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల్ని గుర్తుపెట్టుకుని వారి బాటలో పయనించాలని డాక్టర్ ఉమాశంకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అహల్య ట్రస్ట్ డైరెక్టర్, టీడీపీ గుంటూరు తూర్పు నాయకురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి, పలువురు బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.